సాక్షి పల్నాడు


శనివారం | 11 | జనవరి | 2025

I



ముక్కోటి ఏకాదశి పూజలు

దాచేపల్లి : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం దాచేపల్లిలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో అర్చకులు కొనూరి రవి కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 565.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 9,567 క్యూసెక్కులు విడుదలవుతోంది.



తెనాలి రహదారికి మరమ్మతులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి – తెనాలి ఆర్ అండ్ బీ రహదారికి రెండో విడతలో శుక్రవారం మోరంపూడి నుంచి మంగళగిరి బైపాస్ వరకు మరమ్మతులు చేపట్టారు.

న్యూస్‌రీల్

16న అప్రెంటిస్ మేళా

తెనాలి రూరల్: తెనాలి చినరావూరు ఐటీఐలో ఈ నెల 16న అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరు కావచ్చని, వివిధ కంపెనీలు ఎంపిక చేసుకుంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు నేరుగా సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

అంతర్జాతీయ యోగాలో విజయలక్ష్మికి రజత పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): పుదుచ్చేరిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన 30వ ఇంటర్నేషనల్ యోగా ఫెస్టివల్‌లో గుంటూరుకు చెందిన గోలి విజయలక్ష్మి రజత పతకం గెలుపొందారు. 45–55 వయస్సు విభాగంలో ఈ పతకం గెలిచినట్లు ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ పతకం సాధించిన విజయలక్ష్మిని కుటుంబ సభ్యులతో పాటు యోగా సాధకులు అభినందించారు.

ప్రారంభమైన జాతీయ స్థాయి ఎడ్ల పందేలు



పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జాతీయస్థాయి ఎడ్ల పందేలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పర్చూరు మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో శుక్రవారం ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో నిర్వహించిన పోటీలు ఈ నెల 16వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు. 9 క్వింటాళ్ల బండను 15 నిమిషాల వ్యవధిలో ఎక్కువ దూరం లాగిన జతను విజేతగా ప్రకటిస్తారని వివరించారు. శుక్రవారం 4 పళ్ల విభాగంలో జరిగే పోటీలో 10 ఎడ్ల జతలు పాల్గొంటాయని తెలిపారు. గెలుపొందిన ఎడ్ల జతకు ప్రతి విభాగంలో 9 బహుమతులుంటాయని తెలిపారు. చివరి సమాచారం అందే సమయానికి పల్నాడు జిల్లా చాగంటి శ్రీనివాసరావుకు చెందిన ఎడ్ల జత 15 నిమిషాల వ్యవధిలో 9 క్వింటాళ్ల బండను 4,034 అడుగుల దూరం లాగి ముందంజలో ఉన్నాయి. వ్యాఖ్యాతలుగా రాయంకి వేమారెడ్డి, గూడ శ్రీనివాసరావు, అంపైర్‌గా పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించారు.

18 వరకు గడువు పొడిగింపు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర తెలిపారు. తొలుత ఈనెల 15 వరకు నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ అని ప్రకటించామని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15వరకు వరుసగా ప్రభుత్వ సెలవులు ఉన్నందున 18వ తేదీ వరకు గడువును పొడిగించామని తెలిపారు. ఇప్పటి వరకు 3,530 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

యార్డులో 58,485 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 51,445 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 58,485 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,200 నుంచి రూ.15,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.15,100 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 47,402 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

రేషన్ మాఫియా!

కార్డుదారులను బెదిరించి మరీ బియ్యం కొనుగోలు

కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేదల కడుపు నింపే కొన్ని బియ్యం కూడా దూరం చేస్తోంది. ఇప్పటి వరకు లబ్ధిదారులు ఇస్తే తక్కువ ధరకు బియ్యం తీసుకునేవారు. ఇప్పుడు అధికారం అండతో అక్రమార్కులు బరి తెగించారు. ఏకంగా కార్డుదారులను బెదిరిస్తున్నారు. బియ్యం బదులు నగదు ఇస్తామని బాహాటంగానే చెబుతున్నారు. అదేమని అడిగితే దిక్కున్న చోట చెప్పుకోవాలని బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు.

- పేదలకు బియ్యం ఇవ్వడానికి నిరాకరణ
- బదులుగా డబ్బులిస్తామని బెదిరింపులు
- బండి నిర్వాహకులు, డీలర్ల అడ్డగోలు దందా
- కూటమి సర్కారు వచ్చాక యథేచ్ఛగా అక్రమాలు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

పిడుగురాళ్ల : పట్టణంలోని 12వ వార్డు బ్రహ్మానందరెడ్డి కాలనీలో శుక్రవారం రేషన్ బియ్యం అందించేందుకు బండి వచ్చింది. ఆ ప్రాంతమంతా నిరుపేదలు, రోజు కూలీలు నివసిస్తున్నారు. వారికి ఈ బియ్యమే జీవనాధారం. ఈ విషయం బండి నిర్వాహకులు, డీలర్లకు తెలుసు. అయినప్పటికీ కేజీకి రూ.పది చొప్పున నగదు ఇస్తామని చెప్పారు. ఎవరైనా గట్టిగా అడిగితే దిక్కున్న చోట చెప్పుకోవాలని అధికారంలో ఉన్నామనే అహంకారంతో బెదిరిస్తున్నారు. కొందరు మహిళలకు 20 కేజీల బియ్యానికి కిలో రూ. 10 చొప్పున ఇస్తామన్నారు. బియ్యమే కావాలని మహిళలు, వృద్ధులు కోరితే 10 కేజీల బియ్యం, మిగతా వాటికి రూ.వంద నగదు ఇస్తామని చెప్పారు. అందుకు ఒప్పుకోకపోటంతో రేషన్ బండి నిర్వాహకులు, డీలర్లు .. 'ఇచ్చింది తీసుకోండి. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ భయభ్రాంతులకు గురి చేసేలా బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు.



బియ్యం బదులు డబ్బు తీసుకోవాలని బెదిరించిన బండి నిర్వాహకులు, డీలరు

అడ్డగోలుగా సంపాదన

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసుతో పేదలకు ఒకటో తేదీ రాగానే ఇంటి ముందుకే రేషన్ బండి వచ్చింది. కార్డుదారులకు అక్కడే మొత్తం బియ్యం ఇచ్చేవారు. ఇప్పుడు దీనికి భిన్నంగా పరిస్థితి ఉంది. లబ్ధిదారులు పొలం పనులకు వెళ్లిన సమయంలోనో, ఎవరూ లేని టైం చూసుకొని మరీ రేషన్ డీలర్లు, బండి నిర్వాహకులు ఆయా ప్రాంతాలకు వస్తున్నారు. ఇంట్లో వృద్ధులు, బాలలు ఉంటారని తెలిసి మరీ ఇలా చేస్తున్నారు. వారితో బయోమెట్రిక్‌లో వేలిముద్ర వేయించి, వారి చేతిలో నగదు పెట్టి వెళ్లిపోతున్నారు. రేషన్ బియ్యాన్ని నల్ల మార్కెట్‌లో విక్రయించేందుకు ఇలా దందా చేస్తున్నారు. డీలర్లు ఇలా లాక్కున్న బియ్యాన్ని వ్యాపారులకు కిలో రూ. 25 చొప్పున విక్రయిస్తున్నారు. పిడుగురాళ్ల పట్టణం, మండలంలో ఎక్కడ చూసినా ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ రేషన్ షాపులు 81, బండ్లు 23 ఉన్నాయి. వీరందరూ చేతులు కలిపి ఇలా పేదల పొట్ట కొడుతున్నారు.

తనిఖీల తర్వాత చర్యలు



రేషన్ బియ్యం ఇంటి వద్దకు వెళ్లి డీలర్లు అందించాలి. ఇలా లబ్ధిదారులకు ఇవ్వకుండా బియ్యం కొనుగోలు చేయటం నేరం. ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు మా దృష్టికి రాలేదు. ప్రజల అభ్యర్థన మేరకు సివిల్ సప్లై అధికారులతో తనిఖీలు నిర్వహించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటాం.

– మధుబాబు, తహసీల్దార్, పిడుగురాళ్ల

షాపు వద్దే తెచ్చుకోమంటున్నారు



మాకు గత ప్రభుత్వంలో ఇంటి వద్దకు వచ్చి రేషన్ బియ్యం ఇచ్చేవారు. ఇప్పుడు ఐదు, ఆరు నెలల నుంచి రేషన్ బండి వచ్చినా బియ్యం ఇవ్వడం లేదు. డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. బియ్యం ఇవ్వమని అడిగితే డబ్బు చెల్లిస్తామని చెప్పటం సరికాదు.

– తన్నీరు శశికళ, పిడుగురాళ్ల

డబ్బులు ఏం చేసుకోవాలి?



ఒంటరిగా ఉంటున్న నాకు వచ్చేదే 5 కేజీల బియ్యం. వాటికి డబ్బులిస్తే కూలి చేసుకొని బతికే నాకు ఏం ఉపయోగం. రేషన్ బియ్యంతోనే నా జీవనం సాగుతోంది. ఇప్పుడు బియ్యం ఇవ్వకుండా నగదు ఇస్తే నేను ఏం తినాలి? ఎలా బతకాలి?

– కాంట్రకుంట అంజమ్మ, పిడుగురాళ్ల

దిక్కున్న చోట చెప్పకోమంటున్నారు



మాకు 20 కేజీల బియ్యం వస్తాయి. వాటికి బదులు నగదు ఇస్తామని చెబుతున్నారు. బియ్యమే కావాలయ్యా అని అడిగితే బెదిరిస్తున్నారు. కావాలంటే తీసుకో, లేకుంటే బయోమెట్రిక్‌లో వేలిముద్రలు వేసి వెళ్లిపో. దిక్కున్న చోట చెప్పుకో పో.. అంటూ భయపెడుతున్నారు.

– గుంజా సైదులు, పిడుగురాళ్ల

కోడిపందేలు, గుండాట, జూదం నిషేధం

- ఈ ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరిక



నరసరావుపేట: సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, జూదం, గుండాట, ఇతర నిషేధిత ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... నిషేధిత జూద క్రీడలు నిర్వహించటం, ప్రోత్సహించడం నేరమన్నారు. వీటిని ఆడేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కోడి పందేలు నిర్వహించేందుకు స్థలాలు ఇచ్చినా, బరులు ఏర్పాటు చేసినా, పాల్గొన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఇలా నిర్వహించిన, ఆడిన వారికి జిల్లా వ్యాప్తంగా కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. ఆటలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని, చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ ఆటలు నిర్వహించడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో డ్రోన్ల సహాయంతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 80, బ్యాంక్ కెనాల్‌కు 148, తూర్పు కెనాల్‌కు 290, పశ్చిమ కెనాల్‌కు 120, నిజాంపట్నం కాలువకు 90, కొమ్మమూరు కాలువకు 523 క్యూసెక్కులు విడుదల చేశారు.



కళకళల క్రాంతి



రోడ్డుపై వేసిన రంగవల్లులను తిలకిస్తున్న కలెక్టర్

- కలెక్టరేట్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు
- సాంస్కృతిక నృత్యాలు, కోలాటం ప్రదర్శన
- రంగవల్లులు తీర్చిదిద్దిన మహిళలు
- విజేతలకు బహుమతులు ప్రదానం

నరసరావుపేట: సంక్రాంతి పండుగ వేళ కలెక్టరేట్ శుక్రవారం వేడుకలతో కళకళలాడింది. ఉన్నతాధికారులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు, రంగవల్లుల పోటీలు, హరిదాసు కీర్తనలు, డూడూ బసవన్న విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు అట్టహాసంగా సాగాయి. పెద్ద ఎత్తున నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అనేకమంది మహిళలు పాల్గొన్నారు. ప్రాంగణంలోని రోడ్లను రంగవల్లులతో అందంగా అలంకరించారు. విద్యార్థుల సాంస్కృతిక, జానపద నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో ఎ.మురళి, ఆర్డీవో మధులత సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. రంగవల్లుల పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



హరిదాసుకు బిక్షం వేస్తున్న ఆర్డీవో మధులత, డీడీ దీపి



కలెక్టరేట్‌లో భోగి మంటలు వేస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

ఇద్దరు శతాధిక వృద్ధులు మృతి





వెంకాయమ్మ (ఫైల్) , వెంకటేశ్వర్లు (ఫైల్)

క్రోసూరు: క్రోసూరులోని కొండకింద బజారులో నివసించే ఒకే కుటుంబానికి చెందిన శతాధిక వృద్ధులు (వదిన , మరిది) శుక్రవారం మృతి చెందారు. పోతురాజు వెంకాయమ్మ(110) వయస్సు రీత్యా మృతి చెందారు. ఇప్పటి వరకు తన పనులు తాను చేసుకునేది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మరిది పోతురాజు వెంకటేశ్వర్లు కూడా శతాధికుడే. ఆయన కూడా మృతి చెందాడు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ముక్కోటి.. భక్త కోటి

- కిటకిటలాడిన మంగళాద్రి
- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామి
- వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక

మంగళగిరి (తాడేపల్లి రూరల్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా బంగారు గరుడ వాహనంపై భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు దర్శనం ప్రారంభమైంది. గురువారం రాత్రి జాగారణ ఉన్న భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వార దర్శనంతో భక్తులు పోటెత్తారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ పరిసరాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధి గాంచిన శ్రీదేవి భూదేవి సమేత నారసింహుని ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. గురువారం రాత్రి బంగారు గరుడ వాహనంపై జగన్మోహిని అలంకారంలో గ్రామోత్సంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలతో తిరువంజనోత్సవం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేతుడై బంగారు గరుడ వాహనంపై శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురాతన దక్షిణావృత శంఖంలో భక్తులకు అంతరాలయంలో తీర్థం అందజేశారు. స్వీకరించేందుకు భక్తులు బారులు తీరారు. పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు స్వామిని దర్శించుకుని శంఖు తీర్థం స్వీకరించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు

అమరేశ్వరాలయంలో ఘనంగా ఉత్సవాలు

అమరావతి: అమరావతిలో వేంచేసియున్న ప్రముఖ శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరుని దేవాలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజామున ఆలయంలోని ఉత్తర ద్వారం వద్ద భక్తులకు స్వామి వారి దర్శనాన్ని కలిగించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను రాజవీధికి అభిముఖంగా ఉన్న దక్షిణ గాలిగోపురంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. తరువాత స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే కోదండ రామ, పాండురంగస్వామి దేవాలయాలలో ఉదయాన్నే భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. వైకుంఠపురంలో వేంకన్నను ఊరేగించారు.



గ్రామోత్సవంలో శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుడు

తప్పుకోకుంటే కేసులే

- రేషన్ డీలర్లకు అధికారుల అల్టిమేటం
- సమావేశాలు పెట్టి హెచ్చరిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు
- రాజీనామా చేయకపోతే 6ఏ కేసులు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం చినగంజాంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన దివ్యాంగుడు పాదుర్తి దేవదానం 2013 నుంచి రేషన్ డీలర్‌గా ఉన్నాడు. వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు అన్న అక్కసుతో జులై నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు షాపుపై దాడులు చేసి 6ఏ కేసులు బుక్ చేసి డీలర్‌షిప్ తొలగించారు. ఆయన స్థానంలో పచ్చ పార్టీ నేత చెప్పిన వారికి డీలర్‌షిప్ కట్టబెట్టారు.

➡ చినగంజాం మెయిన్‌లోని ఆత్మకూరు బ్రహ్మయ్య 12 ఏళ్లుగా రేషన్ డీలర్‌గా ఉన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలోనూ డీలర్‌గా ఉన్న బ్రహ్మయ్యను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తొలగించక కొనసాగించారు. కానీ 15 రోజుల కిందట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బ్రహ్మయ్య రేషన్ షాపుపై దాడిచేసి 6ఏ కేసు నమోదుచేసి ఆయన డీలర్‌షిప్ తొలగించి వేరొకరికి కేటాయించారు.

ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాంతాడంత. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన గడచిన ఏడునెలల కాలంలో బాపట్ల జిల్లాలో వందలాది మంది రేషన్ డీలర్లను తొలగించారు. పచ్చనేతల బెదిరింపులతో కొందరు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి తప్పుకోగా 6ఏ కేసులు పెట్టి వేధించడంతో మరికొందరు డీలర్ షిప్పులు వదులుకున్నారు. తాజాగా పచ్చనేతలు పట్టుబట్టడంతో మిగిలిన వారిని తొలగించేందుకు పౌరసరఫరాల అధికారులు సిద్ధమయ్యారు. ఉన్నతాధికారి ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు డీలర్ల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేశారు. చీరాల నియోజకవర్గంలో రెండు వారాల కిందట వేటపాలెం మండలంలోని ఒక కల్యాణ మండపంలో రేషన్ డీలర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 నాటికి రాజీనామాలు చేయాలని, లేకుంటే కేసులు తప్పవని బెదిరింపులకు దిగినట్లు సమాచారం. చీరాల రూరల్, అర్బన్ మండలాల్లోని రేషన్ డీలర్లతో ఆ అధికారి ప్రైవేటు సమావేశం నిర్వహించారు. 99 మంది రేషన్ డీలర్లు ఉండగా, 70 మంది డీలర్లను మాత్రమే తక్షణం రాజీనామాలు చేయాలని అల్టిమేటం ఇచ్చారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ విషయంలో అందరికంటే ముందున్నారు. ఆయన అనుచరులు ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలో పాత డీలర్లందరినీ తొలగించారు. ఒకరిద్దరు బెట్టు చేసినా కేసులకు భయపడి వెనక్కి తగ్గారు. బాపట్ల నియోజకవర్గంలో దాదాపుగా డీలర్‌షిప్పులను పచ్చపార్టీ వారికి కేటాయించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గంలోని చెరుకుపల్లి, నగరం మండలాల్లో ఇప్పటికే పలువురు డీలర్లను తొలగించి వారి స్థానంలో పచ్చపార్టీ కార్యకర్తలను నియమించారు. చెరుకుపల్లి మండలంలో ఆరుగురిపైన, నగరం మండలంలో 18 మందిపై 6ఏ కేసులు పెట్టడం గమనార్హం. మిగిలిన మండలాల్లోనూ పలువురు పాత డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేశారు. వేమూరు నియోజకవర్గంలోనూ ఇప్పటికే పలువురు పాత డీలర్లు రాజీనామా చేయగా మరికొంతమందిపై 6ఏ కేసులు నమోదు చేయించి తొలగించారు. మిగిలిన వారిని జనవరి చివరినాటికి తొలగించే పనిలో పడ్డారు. ఇప్పటికే పచ్చనేతల ఆదేశాలు అందుకున్న పౌరసరఫరాల అదికారులు పాత డీలర్ల తొలగింపు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు.

క్లుప్తంగా

ఏఎంఓ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్-1 పోస్ట్‌కు ఫారిన్ సర్వీస్‌పై పనిచేసేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎల్.చంద్రకళ శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 1 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు 8 సంవత్సరాలు సర్వీసు, 55 సంవత్సరాల లోపు వయస్సు, స్కూల్ సబ్జెక్ట్‌లో పీజీ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. వివరాలకు సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాచర్ల రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కంభంపాడు గ్రామానికి చెందిన బాలంగి వెంకటేశ్వర్లు (60) తన ఆటోలో మాచర్ల నుంచి కంభంపాడు వెళ్తున్నాడు. గోపాలపురం సమీపంలోకి రాగానే బొలేరో ఐస్‌క్రీం బండి ఎదురుగా వచ్చి ఢీకొంది. వెంకటేశ్వర్లు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బొలేరో డ్రైవర్ వెన్నా రామకృష్ణారెడ్డి, మరో ఇరువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఏఎస్ఐ ఎండీ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైనేడ్ హత్య కేసులో తల్లీకూతుళ్ల అరెస్ట్

తెనాలి రూరల్: పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి, ఆమె తల్లి రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్య చేశారు. ఇటీవల అరెస్టు అయి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. సైనేడ్ హత్యలు వెలుగులోకి రావడంతో ఇదే కాలనీకి చెందిన కొవెవరపు మోషే అలియాస్ కూడా సైనేడ్ వల్ల మృతి చెందినట్టు పోలీసులకు ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చింది. తల్లీ కూతుళ్లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచడంతో రిమాండ్ విధించారు.

విజయకీలాద్రిపై వైకుంఠ ఏకాదశి ఉత్సవం


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న వైకుంఠ నాథుడు

తాడేపల్లి రూరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శ్రీ విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం స్వామివారి ఉత్తర దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనాలతో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఎంతో వైభవంగా జరిగిందని తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ఉత్తర ద్వార ప్రవేశం, అనంతరం వైకుంఠనాథస్వామి వారికి అష్టోత్తర శతనామార్చన, శ్రీ గోదా అమ్మవారికి పాసుర విన్నపం, తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో విజయ డైరీ కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హామీలు నెరవేర్చేలా జీవోలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న శిలార్ మసూద్

నరసరావుపేట: గతంలో సమ్మె సందర్భంగా అప్పటి సర్కారు ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ శిలార్ మసూద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల ఎదుట చేపట్టిన రిలే దీక్షలలో భాగంగా స్థానిక మున్సిపల్ ఆఫీసు ఎదుట శిబిరాన్ని జిల్లా కోశాధికారి డి.శివకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మసూద్ మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధనకోసం మున్సిపల్ కార్మికులు గత ప్రభుత్వంలో 17రోజుల పాటు సమ్మె చేస్తే అప్పటి అధికారులతో యూనియన్‌కు ఒప్పందం కుదిరిందన్నారు. ఈ మేరకు ప్రస్తుత జీవోలు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో కార్మికులు కొద్ది జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. తాము చేసే డిమాండ్లు న్యాయమైనవి అన్నారు. ఈ ప్రభుత్వంలో చలనం లేదని, ఒకసారి గుర్తు చేయాలని రిలేదీక్షలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చలించకపోతే సమ్మె చేయటానికైనా సిద్ధమేనని తెలిపారు. రాజకీయ వేధింపులు అధికమయ్యాయని, అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. సోమశేఖర్, ధూపం నాగభూషణం, షేక్ గౌస్‌బాషా, పిల్లి రమేష్, సత్తెనపల్లి నాగేశ్వరరావు, శివరాత్రి కోటేశ్వరరావు, షేక్ ఖాసిం, సయ్యద్ కరీం, షేక్ ఖాదర్, ఇంద్రయ్య, గూడ సామ్రాజ్యం, రమణ, షేక్ షైలు, కె.సమాధానం, ఏసుపోగు మల్లేశ్వరి దీక్షలో పాల్గొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ చిన్న అల్లా బక్షు, కార్మికులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ



జిల్లా ప్రధాన న్యాయమూర్తితో శిక్షకులు, న్యాయమూర్తులు

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలో గత ఐదు రోజులుగా మధ్యవర్తిత్వంపై గుంటూరు, ప్రకాశం, పీఎస్ నెల్లూరు జిల్లాలో ఎంపిక చేసిన న్యాయమూర్తులకు నిర్వహిస్తోన్న నలభై గంటల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అన్నారు. సమస్య పరిష్కారంలో వారే కీలక పాత్రదారులని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంలో కక్షిదారుల ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఉంటుందని, అనుకూలమైన రీతిలో కేసుల్ని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. రాజీపడితే కోర్టు ఫీజులు తిరిగి చెల్లిస్తారని ఆయన తెలిపారు. అగ్రిమెంట్ రాసుకుని రాజీ అయితే జడ్జిమెంట్ కూడా అలాగే వస్తోందని చెప్పారు. నలభై గంటల శిక్షణను న్యాయమూర్తులు విజయవంతం చేశారని ప్రశంసించారు. ఐదు రోజులు న్యాయమూర్తులకు తర్ఫీదు ఇచ్చిన రాజస్తాన్, కేరళ రాష్ట్రాలకు చెందిన ఆచార్య అడ్వకేట్ ప్రమీల, అడ్వకేట్ వి.పి.తంకచన్‌లను సత్కరించారు.

రెవెన్యూ అధికారుల అవినీతిపై ఆర్డీవో విచారణ

- లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన బాధితురాలు
- అధికారులు, సిబ్బంది తీరుపై ఆర్డీవో తీవ్ర ఆగ్రహం


విచారణ చేస్తున్న ఆర్డీవో మధులత

శావల్యాపురం: రెవెన్యూ కార్యాలయం అవినీతిమయంగా మారిందని వరుస ఫిర్యాదులు రావడంతో కలెక్టరు ఆదేశాల మేరకు నరసరావుపేట ఆర్డీవో కె.మధులత శుక్రవారం విచారణ చేపట్టారు. ఒక్కో ధ్రువీకరణ పత్రానికి ఒక్కో రేటును రెవెన్యూ అధికారులు నిర్ణయించారని, ధరల పట్టికను సైతం సామాజిక మాధ్యమాల్లో టీడీపీ నాయకులు పోస్ట్ చేశారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో ఇవేమీ అమలు కావటం లేదు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులపై ఆర్డీవో మధులత విచారణ చేపట్టారు. మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన ముంద్రు పేరమ్మ ఫ్యామిలీ ధ్రువీకరణ పత్రం కోసం మీసేవా సెంటరు నిర్వహించే గట్టుపల్లి మహేష్‌ను సంప్రదించారు. రూ. 2500 ఖర్చు అవుతుందని, ఇందులో రెవెన్యూ అధికారులకు వాటా ఇవ్వాలని చెప్పాడు. దీంతో అర్జీకి సంబంధించిన రుసుం మాత్రమే చెల్లించి తదుపరి తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ కూడా లంచం అడగ్గా గత్యంతరం లేని పరిస్థితుల్లో తహసీల్దారు కారు డ్రైవరుకు రూ. 1000 ఇచ్చారు. ఆ తర్వాతే ధ్రువీకరణ పత్రం తీసుకున్నట్లు ఆర్డీవో మధులతకు పేరమ్మ లిఖితపూర్వకంగా తెలిపారు.

ఒకే భూమి ఇద్దరికి విక్రయం

మండలంలోని పిచికలపాలెం గ్రామంలో సర్వే నంబరు 324లో తుర్లపాటి సీతయ్యకు చెందిన సాగు భూమిని అదే గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లు ఎకరం 45 సెంట్లు కొన్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారుల ప్రమేయంతో నకిలీ పత్రాలు సృష్టించి ఇదే భూమిని చేబ్రోలు శిరీషకు కూడా సీతయ్య విక్రయించాడు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి రిపోర్టు ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు. సీతయ్యపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆర్డీవో విలేకర్ల సమావేశంలో తెలిపారు.

సమయ పాలన పాటించాలి

తహసీల్దారు కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించకపోవడంపైనా ఆర్డీవో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తహసీల్దారు కె.సుజాత మధ్యాహ్నం 12.30 నిమిషాలకు కార్యాలయానికి రావటంపై ప్రశ్నించారు. సాకులు చెప్పవద్దని, ఎన్ని పనులున్నా సమయానికి ఆఫీసుకు రావాలని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, మండల రైతు సంఘం నాయకులు కె.వి.ఆర్.మోహన్‌చందు ఇక్కడి అధికారుల తీరుపై ఆర్డీవోకు వివరించారు. అనంతరం రెవెన్యూ అధికారులు తిరస్కరించిన అర్జీల రికార్డులను పరిశీలించారు. తహసీల్దారు కె.సుజాత, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పేరిసోముల నాసరయ్య, సీనియర్ సహాయకులు చంద్రబాబు, వీఆర్వో నరసింగరావులు ఆర్డీఓ వెంట ఉన్నారు.

అంగన్‌వాడీల పోరుబాట

- ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ముట్టడి
- బైఠాయించి నినాదాలు

లక్ష్మీపురం: అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి ఏడాది పైగా అయినా ఇంతవరకు పోస్టులు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.రేఖ అన్నారు. గత నాలుగు రోజులుగా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరహారదీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు కుమారి అధ్యక్షతన ఐసీడీఎస్ పీడీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎప్పటికప్పుడు ఖాళీ అయిన పోస్టులను గుర్తించి ఇంటర్వ్యూలు నిర్వహించి, పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. గుంటూరు జిల్లా అధికారులు మాత్రం జిల్లాలో నూట పది పోస్టులు ఖాళీ ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ చేయట్లేదని ఆమె ప్రశ్నించారు. జిల్లాలో 39 మంది వర్కర్స్, 66 మంది హెల్పర్ పోస్టు ఖాళీగా ఉండటం వల్ల ఆయా సెంటర్లకు వచ్చే పిల్లలు ఏమి నేర్చుకోవాలని నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు సక్రమంగా పనిచేయకపోతుంటే, వాటిని మార్చడానికి బదులు అధికారులు మెమోలు ఇచ్చి వేధించటం సరికాదని తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై. నేతాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీలు రాష్ట్రవ్యాప్తంగా 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మర్ హాలిడేస్ అంగన్‌వాడీ సెంటర్లకు కూడా వర్తింపజేయాలని కోరారు, మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, నాయకులు బి. లక్ష్మణరావు, బాబు ప్రసాద్, హుస్సేన్ వలి ప్రసంగించారు.

పండుగ తరువాత సమస్యలు పరిష్కరిస్తాం

ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యలపై చర్చించారు. పండుగ సెలవుల అనంతరం ఇంటర్వ్యూలో నిర్వహించిన హెల్పర్లందరికీ పోస్టింగులు ఇస్తామన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వర్కర్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి యూనియన్ నాయకులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

ఉత్సవమేదైనా ఖాకీలదే అత్యుత్సాహం !

- దర్శన వ్యవస్థ మొత్తం వారి ఆధీనంలోనే..
- సామాన్య భక్తులకు చుక్కలు
- దేవస్థాన సిబ్బందితోనూ వాగ్వివాదం


మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద సామాన్య భక్తులతో వాగ్వివాదం చేస్తున్న పోలీసులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఉత్సవం ఏదైనా ఆ సమయంలో భక్తులు ఎంతమంది వస్తారు? వారికి దర్శనం ఎలా కల్పించాలనే ? అంశంపై దేవదాయ శాఖ అధికారులు, ఆలయ ఉద్యోగులకు పూర్తి అవగాహన ఉంటుంది. సంప్రదాయాన్ని పాటిస్తూ భక్తులకు దర్శనం కల్పించడంపై వారంతా ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. రద్దీని నియంత్రించేందుకు, క్యూలైన్లు సక్రమంగా సాగేందుకు, తొక్కిసలాట వంటివి జరగకుండా పోలీసుల సహాయం తీసుకుంటారు. రెండు విభాగాల సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఇందుకు విరుద్ధంగా పర్యవేక్షణను పోలీసులు తమ చేతుల్లోకి తీసుకుని, దేవదాయ శాఖ అధికారుల సూచనలను పక్కన పెట్టడం విమర్శలకు తావు ఇస్తోంది.

పోలీసుల తీరుపై విమర్శలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారిని ఉత్తర ద్వారంలో దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారుల వైఫల్యం, పోలీసుల తీరు భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. తమకు తెలుసుకు వారిని, బంధువులను నిబంధనలకు విరుద్ధంగా పెద్ద సంఖ్యలో ప్రోటోకాల్, వీఐపీ ద్వారా దర్శనానికి పంపి పోలీసులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చున్నా ఉపయోగం లేదంటూ వాపోతున్నారు. భక్తులు గతంలో ఎన్నడూ లేనంతా ఈసారి ఇబ్బందులు ఎదుర్కోవడానికి అధికారుల నిర్ణయాలతో పాటు పోలీసుల తీరు ఒక కారణమని విమర్శలు ఉన్నాయి. స్థానిక పోలీస్ అధికారుల కంటే బయట నుండి వచ్చిన పోలీసులే హడావుడి చేయడంలో డిపార్ట్‌మెంట్‌లోనే గుసగుసలు వినబడుతున్నాయి.

ఈవోతోనూ వాగ్వివాదం

ప్రధాన గోపురం ఎదురుగా ఉన్న వీఐపీ గేటు వద్ద బయట నుంచి ఓ అధికారి భక్తులపై రుసరుసలాడడంతో పాటు దేవదాయ శాఖ సిబ్బంది, కార్యనిర్వహణాధికారిపై సైతం వాగ్వివాదానికి దిగడం చర్చనీయాంశమైంది. సమయపాలన లేకుండా వీఐపీల కోసం ఎప్పుడు పడితే అప్పుడు సామాన్య భక్తుల క్యూలైన్లను నిలిపివేసి ఇబ్బంది కలిగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడుతూ నరకం అనుభవించారు.

‘ఒక జిల్లా ఒక ఉత్పత్తి’పై కేంద్ర బృందం అధ్యయనం

- గుంటూరు మిర్చి యార్డు సందర్శన
- అధికారుల నుంచి వివరాల సేకరణ


మిర్చి యార్డులో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ ఇషదీప్, డాక్టర్ దివ్య, స్వప్నిల్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ‘ఒక జిల్లా ఒక ఉత్పత్తి’లో భాగంగా గుంటూరు జిల్లా మిర్చి పంటపై ఢిల్లీ పీఎంఓ ఆఫీసులో ఓడీఓఎఫ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు డాక్టర్ ఇషదీప్, డాక్టర్ దివ్యలు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, జిల్లా రైతులు పండించిన కొన్ని మిరప రకాలను వీక్షించారు. ఓడీఓపీ డాక్యుమెంటేషన్‌పై చర్చించారు. కార్యక్రమానికి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ అధ్యక్షత వహించారు. ఆ తర్వాత డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ, లాంఫారంను సందర్శించారు. మిరప రకాలు, చేపడుతున్న ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. లాం ఆర్ఎస్‌కేని సందర్శించి, డిజిటల్ గ్రీన్ వారు రైతులకు అందిస్తున్న సేవల గురించి వాకబు చేశారు. అనంతరం అంకిరెడ్డిపాలెంలో ఉద్యాన శాఖ ద్వారా రాయితీ పొందిన విశ్వసాయి ఫుడ్స్ అండ్ కోల్డ్‌స్టోరేజీని సందర్శించారు. రైతులకు ఎలాంటి ప్రయోజనం కలుగుతోంది ? రైతులకు ఏ విధంగా స్టోరేజీలు ఉపయోగపడతున్నాయో ? విపులంగా తెలుసుకున్నారు. అనంతరం గుంటూరు మిర్చి యార్డు, చుట్టుగుంటలోని స్పైసెస్ బోర్డు కార్యాలయంను సందర్శించి, వారు చేపడుతున్న ప్రాజెక్ట్స్‌ను అడిగి తెలుసుకున్నారు. మిర్చి యార్డులో విస్తృతంగా పర్యటించారు. సాగులో ఉన్న మిర్చి రకాలు, ధరలు, సీజన్ వ్యవధి, రోజుకు వస్తున్న బస్తాలు, ఏఏ జిల్లాల నుంచి గుంటూరు యార్డుకు మిర్చి వస్తుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పైసెస్ బోర్డు కార్యాలయంలోని మిరప టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించారు. మిర్చి పండించే రైతులు, మిర్చి ఎగుమతిదారులకు ల్యాబ్ వల్ల కలిగే ప్రయోజనాలను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బి.రవీంద్రబాబు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు, డాక్టర్ రమణ, శారద పాల్గొన్నారు.

కళా పరిషత్ నాటక సంబరాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న అతిథులు

నగరంపాలెం: గత 26 ఏళ్లుగా గుంటూరు కళా పరిషత్‌ను ఆదరిస్తోన్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గుంటూరు కళాపరిషత్ అధ్యక్షుడు పి.వి. మల్లిఖార్జునరావు అన్నారు. మూడు రోజులపాటు జరిగే కళాపరిషత్ 27వ వార్షిక నాటకోత్సవాల ప్రారంభ సభ శుక్రవారం రాత్రి మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సమయ పాలనను కచ్చితంగా పాటిస్తూ, కళా పరిషత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ వైద్యులు యెండ్లూరి సీతారామాంజనేయులు మాట్లాడుతూ వాస్తవికమైన కథాంశాలతో సాగుతున్న నాటక రంగాన్ని ప్రేక్షకులు బాగా ప్రోత్సహించాలని కోరారు. ప్రముఖ రంగ స్థల నటుడు వేముల మోహనరావు మాట్లాడుతూ నిబద్ధతతో రాష్ట్రానికే తలమానికంగా కళా పరిషత్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ తదితరులు మాట్లాడారు. రచయిత షేక్ సైదా, ప్రజా నాట్యమండలి నాయకులు కొండలరావు దేశభక్తి గీతాలు ఆలపించారు. తొలుత విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో స్వేచ్ఛ నాటికను ప్రదర్శించారు. పి.ఎస్.నారాయణ మూలకథ అందించగా, పరమాత్ముని శివరామ్ నాటకీకరణ చేయగా, బీఎంరెడ్డి దర్శకత్వం వహించారు. కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటిక ప్రదర్శించారు. రైలు ప్రమాదాలు జరిగినప్పుడు జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి వివరాలు ఉండవని, ప్రమాద వేళల్లో బాధితుల వేదన వర్ణాతీతమని వివరించారు. పి.టి.మాధవ్ నాటికను రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. అనంతరం రుతువు లేని కాలం నాటికతో బంధాల విలువలను తెలియజేశారు.

సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ హైస్కూల్లో శుక్రవారం గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపికలను నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను హిందూ కాలేజీ హైస్కూల్ కౌన్సిల్ కార్యదర్శి కేఏస్సార్ కుటుంబరావు, ఏపీ హాకీ డైరెక్టర్ ఎం.నిరంజన్‌రెడ్డి పర్యవేక్షించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్టు ఈనెల 17,18,19వ తేదీల్లో మదనపల్లెలో జరగనున్న 14వ ఏపీ సబ్ జూనియర్ బాలుర అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటుందని హాకీ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం. అజయ్‌బాబు తెలిపారు.

కోతుల పట్టివేత



సాక్షి ఎఫెక్ట్

మాచర్ల రూరల్: పట్టణంలో కోతుల బెడదతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. నివాసాల్లోకి వచ్చి నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రిని వానరాలు తీసుకెళుతున్నాయి. చిన్నారులను, పాదచారులను గాయపరుస్తూ స్థానికులను ఇబ్బంది పెడుతున్నాయి. కోతుల బెడదపై గత నెల 29వ తేదీన ‘సాక్షి’లో ప్రచురించిన కథనంతో పురపాలక అధికారులు స్పందించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ ధూళిపాళ్ళ వేణుబాబు తగిన చర్యలు చేపట్టారు. సంబంధిత సిబ్బందిని పిలిపించి శుక్రవారం 70 కోతులకు పైగా పట్టుకొని అడవుల్లో విడిచిపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో ఎక్కడా కోతులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ చెప్పారు. కార్యక్రమంలో ఒకటవ వార్డు కౌన్సిలర్ గట్లా కోటిరెడ్డి, దస్తగిరి, శ్రీనివాసరావు తదితరులున్నారు.